

భూహక్కు పత్రాల పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

జిల్లాలో రీసర్వే కింద భూ హక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. గురువారం నాడు విజయవాడ సిసిఎల్‌ఎ కార్యాలయం నుంచి రీ సర్వేకి సంబంధించిన అంశాలపై భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 31 నాటికి రీ సర్వే పూర్తి చేసి సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేసి భూహక్కు పత్రాలను కూడా పంపిణీ చేసి, తుది ఆర్వోఆర్ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ ఫేస్-2 కింద పెండింగ్‌లో ఉన్న భూహక్కు పత్రాలు శనివారం నాటికి పంపిణీ పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్‌ఒ కొండయ్య, సర్వే అధికారి రామకృష్ణ, జిల్లా రెవెన్యూ సర్వే అధికారులు పాల్గొన్నారు.



2020లో అనంతపురం మీదుగా ప్రారంభం అయిన కిసాన్ రైలు(ఫైల్‌ఫోటో)

కిసాన్ రైల్ కిదర్‌హై..?

ఉద్యానవన రైతులకు మంచి గిట్టుబాటు ధర కల్పిస్తామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిసాన్ రైల్ పేరుతో మూడేళ్ల క్రితం హడావుడి చేశాయి. ముచ్చటగా మూడు రైళ్లు నడిపాయి. అంతలేని దానిని నడపలేక చేతులెత్తేశాయి. ప్రస్తుతం ఉద్యానవన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నా... పట్టించుకునే వారు లేరు. టమోటా లాంటి పంటలైతే ధరలేక రోడ్లపైనే పడేసే పరిస్థితి నెలకొంది.

- 2020లో హడావుడి
- ఆ తరువాత ఊసెత్తని పాలకులు
- ఉద్యానవన రైతులకు ప్రోత్సాహం కరువు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉద్యానవన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిసాన్‌ను రైల్‌ను 2020 సెప్టెంబర్ తొమ్మిదవ తేదీన ప్రారంభించారు. అనంతపురం నుంచి నేరుగా ఢిల్లీకి ఈరైలు వెళ్లే ఏర్పాటు చేశారు. 332 టన్నులు టమోటా, అరటి, బత్తాయి, బొప్పాయి తదితర పంటలను ఎగుమతి చేశారు. ఆ తరువాత రెండు పర్యాయాలు ఇదే రకంగా ఎగుమతి చేశారు. అనంతరం దీని రప్పించి పంటలను పంపే ఏర్పాట్లపై ఎవరూ పట్టించుకోకుండా వదిలేశారు.

అంతన్నారు...ఇంతన్నారు..!

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తొమర్, రైల్వే శాఖ మంత్రి సురేష్ సి.అంగడి, ముఖ్యమంత్రి



కిసాన్ రైల్ ద్వారా టమోటాలను ఢిల్లీకి పంపుతున్న అప్పటి కలెక్టర్ గంధం చంద్రుడుడు, ఇతర అధికారులు(ఫైల్ ఫోటో)

వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అధికారులందరూ కలసి పచ్చ జెండాను ఊపి కిసాన్ రైల్‌ను ప్రారంభించారు. ఈ సమయంలో కాసన్ ఉడాన్, కిసాన్ రైల్‌ను నడుపుతున్నట్టు తొమర్ తెలిపారు. కిసాన్ రైల్ వల్ల వ్యవసాయ ఆర్థికాభివృద్ధి ఉపయోగపడుతుందని చెప్పారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద లక్ష కోట్ల నిధులు కేటాయించినట్టు పేర్కొన్నారు. అయితే ఇవన్నీ ఉత్తుత్తి మాటలుగానే మిగిలిపోయాయి.

ఉద్యానవపంటలకు అనంత ప్రసిద్ధి

ఉమ్మడి అనంతపురం జిల్లా ఉద్యానవ పంటలకు ప్రసిద్ధి. సుమారు నాలుగున్నర లక్షల ఎకరాల్లో ఈ పంటలు సాగవుతాయి. ఏడాదికి సుమారు 58 లక్షల మెట్రిక్ టన్నులు పండ్లు, కాయగూరలు, పూలు దిగుబడి వస్తాయి. రాష్ట్రంలో వచ్చే దిగుబడుల్లో 80 శాతం ఇక్కడే పండుతాయి. ఒక్కోసారి పంటలకు ధర ఉండటం లేదు. ప్రధానంగా టమోటా పంట ఏటా ధర లేక రోడ్డుపై పడేస్తున్నారు. ఈ ఏడాది కూడా ఆగస్టు వరకు ధర అధికంగా ఉండేది. ఆ తరువాత నుంచి ధర పడిపోయింది. కొనేవాళ్లు లేక రోడ్డుపై టమోటాలను పడేస్తున్నారు. ఈ సమయంలో ధరవున్న ప్రాంతాల్లోకి ఈ పంటను తరలించే ప్రత్యేకమైన ఏర్పాట్లు ఏవీ లేకపోవడం గమనార్హం.

ప్రచారానికే పరిమితమైన కిసాన్ రైల్

ఎంతో ఆర్భాటంగా కిసాన్ రైల్‌ను అప్పుడు ప్రారంభించారు. ఇది ప్రచారానికే తప్పా రైతులకు ఉపయోగ పడింది ఏమీ లేదు. రైలు ముందుగా బుక్ చేసుకుంటేనే కిసాన్ రైల్‌ను పంపుతారు. దానికంటే ప్రత్యేకమైన వ్యవస్థ ఏదీ లేదు. ముందు నుంచి తాము సూచిస్తున్నది ఒక్కటే సాధారణ రైళ్లలోనే రెండు బోగిలను పంటల ఎగుమతులకు ఏర్పాటు చేయాలని, అది చేయడం లేదు. రవాణా ఛార్జీలను కూడా తగ్గించాలి. ఇలా చేస్తే ఉద్యానవన రైతులకు కొంత ఉపయోగంగా ఉంటుంది.

శివారెడ్డి ఎపి పండ్లతోటల రైతు సంఘం జిల్లా నాయకులు.

ప్రభుత్వ విద్యను కాపాడుకుందాం

- ఓపీఎస్‌ను పునరుద్ధరించేంత వరకు పోరాటం
- అణచివేత ధోరణి విడనాడకపోతే ఉపాధ్యాయుల సత్తా చూపుతాం
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు
- జిల్లాలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ ప్రచార యాత్ర



జాతా సందర్భంగా అనంతపురంలో యుటిఎఫ్ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ విద్య పరిరక్షణతో పాటు ఓపీఎస్‌ను సాధించుకోవడమే లక్ష్యంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో ముందుకు సాగుతామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నుంచి విజయవాడ వరకు బైక్‌ర్యాలీ గురువారం ప్రారంభం అయ్యింది. ఎన్జీవో హోం వద్ద యుటిఎఫ్ జెండా, స్వర్ణోత్సవ బోర్డును ఆవిష్కరించారు. శాంతికి ప్రతి రూపాలైన పావురాలను ఎగర వేసి గోపత్రికలు, కరపత్రాలను విడుదల చేశారు. హిందూపురంలో ప్రారంభం అయిన యాత్రను వెంకటేశ్వర్లు జెండాఊపి ప్రారంభించారు. ఈ యాత్ర హిందూపురం నుంచి పెనుకొండ, రాప్తాడు, అనంతపురం, ఉరవకొండ, గుంతకల్లు మీదుగా గురువారం రాత్రికి కర్నూలు జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో రెండు ప్రచారయాత్రలు ప్రారంభం అయ్యాయని చెప్పారు. ఒకటి హిందూపురంలో ప్రారంభం అవగా, మరొకటి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభం అయ్యిందన్నారు. రెండు జాతాలు విజయవాడకు చేరుకుంటాయన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాలను కలుపుతూ జాతాలు కొనసాగుతాయన్నారు. 'ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించుకుందాం' అన్న నినాదంతో జాతా కొనసాగుతోందని చెప్పారు. అక్టోబర్ 1న విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా నేటి విద్యారంగ పరిస్థితిపై మేధావులతో చర్చ జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడటాన్ని యుటిఎఫ్ ప్రధాన బాధ్యతగా తీసుకుందని చెప్పారు. 1974వ సంవత్సరంలో యుటిఎఫ్ ఆవిర్భావం నుంచి విద్యారంగ సమస్యల పరిష్కారంపై అనేక పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన విద్యా విధానాలు ప్రభుత్వ విద్యకు తీవ్ర నష్టదాయకంగా ఉన్నాయన్నారు. ఎన్నికలకు ముందు జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వారంలో పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని గొప్పలు చెప్పారన్నారు. అధికారంలో వచ్చిన నాలుగేళ్ల అనంతరం జిపిఎస్ పేరుతో ఉద్యోగులకు నష్టం చేకూర్చే మరో పెన్షన్ విధానం తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమిస్తే ప్రభుత్వం నిర్బంధాలకు పాల్పడుతోందన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళనలు చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోవడం విచారకరం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం హక్కులను హరించే పాలన మానుకోవాలని హితవు పలికారు. జగన్మోహన్‌రెడ్డి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చక పోతే రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు 2024 ఎన్నికల్లో ఆయనకు గట్టిగా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. సమస్యల పరిష్కారంపై సాగించే పోరాటంలో భవిష్యత్తులో కలిసొచ్చే సంఘాలను కలుపుకుని విద్యారంగ సమస్యలపై ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్, సత్యసాయి జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఎన్‌ఎస్‌పిఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి, గౌరవాధ్యక్షులు భూతన్న, సహాధ్యక్షులు బాబు, సీతాలక్ష్మి, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి తాహెర్ వలీ, రాష్ట్ర కౌన్సిలర్ మారుతి, నాయకులు రామకష్ణ, మహంతి, చెన్న, మురళి, శ్రీనివాసులు, ముస్తఫా, సుల్తాన్, చంద్ర, రవి, విజయ్‌తో పాటు పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రస్తుతం ప్రజల చేతుల్లోనే ఉందని, దానిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని టిడిపి జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బికె పార్థసారథి పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ గురువారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద టిడిపి ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ కమిటీల ఆధ్వర్యంలో సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సైకో జగన్‌రెడ్డి పాలనను అసహించుకుంటున్నా రన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య వాదులు, మేధావులు ప్రతి ఒక్కరూ జగన్ పాలనపై విసుగు చెందారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలో టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి



పెనుకొండలో సామూహిక నిరాహార దీక్షలో పాల్గొన్న బికె పార్థసారథి

జగన్‌ది పైశాచిక ఆనందం : బికె

రొద్దం : టిడిపి అధినేత చంద్రబాబుని అక్రమంగా అరెస్టు చేయించి జైలుకు పంపి సిఎం జగన్ పైశాచిక ఆనందం పొందుతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బికె పార్థసారథి విమర్శించారు. రొద్దంలో గురువారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ ఇవ్వండని జగన్ ప్రాధేయపడగా ప్రజలు నమ్మి ఓటు వేసి గెలిపించారన్నారు. అయితే అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు కడిగిన ఆణిముత్యంలా జైలు నుంచి బయటకు వస్తారని తెలిపారు. యావత్తు రాష్ట్ర ప్రజానీకం చంద్రబాబుకు తోడుగా మేము సైతం అంటూ ముందుకొచ్చి సంఘీభావం తెలుపుతున్నారన్నారు. ఆయనతో పాటు జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, పెనుకొండ నియోజకవర్గ అధ్యక్షులు చిన్నప్పయ్య, ఎం.కొత్తపల్లి సర్పంచ్ నాగరాజు, నాయకులు నారాయణ, హరీష్, మురళి, నాగరాజు, నారాయణ, దొడఘట్ట రామచంద్ర, ఇమాం, గోనిమేకలపల్లి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వాలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-అగళి

మండల పరిధిలోని వివిధ గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టులకు ఈ నెల 25వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ రవిప్రసాద్ తెలిపారు. ఖాళీల వివరాలు.. నలసాంభూది పంచాయతీలో క్లస్టర్-17(బిసి-బి), రావుడి పంచాయతీలో క్లస్టర్-11,15(ఎస్సీ), హళ్లికెర పంచాయతీలో క్లస్టర్-7(ఎస్సీ), రాగేనింగినపల్లి పంచాయతీలో క్లస్టర్-17(బిసి-డి), కోడిపల్లి పంచాయతీలో క్లస్టర్-6(బిసి-బి) కేటగిరీలకు కేటాయించారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18-35 ఏళ్ల లోపు ఉన్న స్థానికులు(యువతీ, యువకు లు) అర్హులు. ఆ పంచాయతీలోని దరఖాస్తు అందజేయాలి. ఈ నెల 27, 28 తేదీల్లో ఎంపిడిఒ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఎంపికైన వారికి అక్టోబర్ 1వ తేదీ నియామక పత్రాలు అందజేస్తామని ఎంపిడిఒ తెలిపారు.



నిమజ్జనానికి తరలుతోన్న గణనాథులు

ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం

సోమందేపల్లి : మండల కేంద్రమైన సోమందేపల్లిలో గురువారం వినాయకుని విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లలో గణనాథులను కొలువుదీర్చి డప్పు వాయిద్యాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం సమీపంలోని నీటి కుంటలు, చెరువుల్లో గణనాథుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని చౌడేశ్వరీ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద గురువారం శ్రీచౌడేశ్వరి వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్ర మాలు ఏర్పాటు చేశారు. శిబిరంలో యువతతో పాటు సేవా సమితి కమిటీ సభ్యులు సుమారు 50 మంది రక్త దానం చేశారు. ఈ రక్తాన్ని హిందూపురం ప్రభుత్వాసుపత్రికి అందజేస్తామని వారు తెలిపారు. అనంతరం 200 మందికి అన్నదానం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేస్తామని సేవా సమితి సభ్యులు తెలిపారు.



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

వినాయక మండపంలో విషాదం

డ్యాన్స్ చేస్తూ యువకుడు మృతి



ప్రసాద్ (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఉత్సవాల్లో భాగంగా విగ్రహం ముందు డ్యాన్స్ చేస్తూ ఓ యువకుడు గుండెపోటుకు గురై అక్కడికక్కడే మరణించాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ధర్మవరం పట్టణం మారుతీనగర్‌లో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి మండపం వద్ద లక్ష్మీదేవి, నాగప్పల కుమారుడు ప్రసాద్(25) ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తూ అందరూ చూస్తుండగానే ఉన్నఫలంగా కింద పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మతుడు టైల్స్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మృతునికి భార్య, రెండు నెలల కుమార్తె ఉంది. కుటుంబ పెద్దదిక్కును కోల్పోవడంతో తల్లిదండ్రులు, భార్య కన్నీటి పర్యవంతం అయ్యారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా స్థాయి పోటీలకు పెద్దమంతూరు విద్యార్థులు

ప్రజాశక్తి-రొద్దం



జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు మండల పరిధిలోని పెద్దమంతూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు హెచ్ఎం ముజుఫర్ హుసేన్ తెలిపారు. కొడిగెనహళ్లిలో ఇటీవల జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో భాగంగా అండర్-17 బాలుర విభాగంలో గంగాధర్, మాధవరాజు, కుమార్, బాలికల విభాగంలో ఐశ్వర్య, అండర్-14 బాలికల విభాగంలో మేనక, చరణ్య ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు పిడి బాలాజీనాయక్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారలను హెచ్ఎం, పిడి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

నియోజకవర్గ పోటీల్లో ఎంజెబి విద్యార్థుల ప్రతిభ

నియోజకవర్గ స్థాయి పోటీల్లో రొద్దంలోని ఎంజెబి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ గోపాల్ తెలిపారు. కొడిగెనహళ్లి పాఠశాలలో నిర్వహించిన అండర్-14 కబడ్డీ పోటీల్లో అభిరామ్, షటిల్‌లో అభిరామ్, టెన్నికాయిట్‌లో జయవర్ధన్, అండర్-17 కబడ్డీలో ఆదర్శ, దేవీష్, గంగశేఖర్, షణ్ముఖకుమార్, వాలీబాల్‌లో దినేష్, షటిల్‌లో యువరాజ్, జయవర్ధన్, టెన్నికాయిట్‌లో శ్రీనాథ్, త్రో బాల్‌లో ఓబులేసు, విష్ణు వర్ధన్ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పిఇటి రామకృష్ణ తెలిపారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా స్థాయిలో కూడా రాణించి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై అవగాహన

ప్రజాశక్తి-గోరంట్ల

'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంపై గురువారం అధికారులు పట్టణంతో పాటు గ్రామ సచివాలయాల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల అనారోగ్య సమస్యలు గుర్తించడంతో పాటు తద్వారా పొందే వివరాలను ప్రజలకు వివరించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రఘునాథ్ గుప్తా, గోరంట్ల మేజర్ పంచాయతీ కార్యదర్శి బాబురావు, గోరంట్ల-2 పంచాయతీ కార్యదర్శి రవీంద్ర, ఎఎన్ఎం రాజ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పిలు గౌతమి, ప్రత్యూష, ఆశా వర్కర్లు శబరి, సరస్వతి, నాగమణి, వాలంటీర్లు కౌసర్ బాను, రఫియ, షబానా, పంచాయతీ స్టాఫ్ శ్రీరాములు పాల్గొన్నారు.



గోరంట్లలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'పై ప్రజలకు వివరిస్తున్న అధికారులు

గురజాడ అప్పారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-పెనుకొండ



సిపిఎం కొట్టాలలో గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా సభ్యులు

గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని సిపిఎం కొట్టాలలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐద్వా మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌతమి మాట్లాడు తూ 19వ శతాబ్దంలో గురజాడ 'దేశమంటే మట్టి కాదు-దేశమంటే మనషులోయ్', కన్యాశుల్కం, తదితర సమాజాన్ని జాగృతం చేసే అనేక రచనలు చేశారన్నారు. ప్రధానంగా మహిళల హక్కుల కోసం ఆనాడే పెద్ద ఎత్తున ప్రచారం, ఆందోళన కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ ఎ.హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.గంగాధర్, ఐద్వా మహిళా నాయకురాలు నాగమణి, జయంతి, దివ్యభారతి, వ్యకాసం జిల్లా నాయకులు వెంకటరాముడు, సిపిఎం సభ్యులు తిప్పన్న, రమేష్, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ కేశవరావు ఆధ్వర్యంలో గురజాడ వెంకట అప్పారావు జయంతి సభ నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం సాంఘిక విప్లవం, గిడుగు రామ్మూర్తిపంతులు భాషా విప్లవాన్ని సమన్వయించుకుని తనదైన శైలిలో సరికొత్త సాహిత్య విప్లవాన్ని సృష్టించిన గొప్ప కవి అని కొనియాడారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయప్ప మాట్లాడుతూ గురజాడ ప్రజలందరికీ అర్థమయ్యే వాడుక భాషలో రచనలు చేశారన్నారు. తెలుగు అధ్యాపకులు దేవిశెట్టి రామన్న మాట్లాడుతూ నాటి సాంఘిక దురాచారాలైన బాల్య వివాహాలు, సతీసహగమనం, అంటరానితనం వంటి సమాజంలోని సాంఘిక రుగ్మతలను రూపుమాపడమే కాకుండా, వితంతువులకు పునర్వివాహం జరిపించిన సంఘసంస్కర్త గురజాడ అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ యశోధరాణి, హరిప్రసాద్, ప్రతాప్, హరీష్, రంగనాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో 'యశోద' విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం టౌన్ : కర్నూల్ జిల్లా జమ్మలమడుగులోని గిద్దలూరులో ఈ నెల 17న జరిగిన టార్గెట్ బాల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్స్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు యశోద పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ పృథ్వీతో పాటు ప్రిన్సిపల్ అనూప, వ్యాయామ ఉపాధ్యాయులు అశోక్, మణికంఠ, జ్యోతి అభినందించారు.

మల్బరీ సాగుపై అవగాహన

గాండ్లపెంట : మండల పరిధిలోని మునగలవారిపల్లిలో రైతులకు మల్బరీ సాగుపై అధికారులు అవగాహన కల్పించారు. రైతు జి విశ్వనాథరెడ్డి షెడ్డు వద్ద గురువారం సోమయాజులపల్లి, కత్తి వారి పల్లి, వేపరాళ్ల గ్రామాలకు చెందిన రైతులకు మల్బరీ తోటలు పెంపకం, వైఎస్ఆర్ పట్టుబడి తదితర వాటిపై పరిశ్రమల శాఖ డివిజనల్ అధికారి గీత వివరించారు. ఈ కార్యక్రమంలోపట్టు పరిశ్రమ శాఖ అధికారి రామకృష్ణ, మండల అధికారి ఇమామ్, రైతులు జి ఓబుల్ రెడ్డి, రఘునాథరెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

కొత్తచెరువు రూరల్ : ప్రజలు తమ ఆర్థిక అవసరాలను తీర్చుకోవడానికి డిజిటల్ లావాదేవీలు నిర్వహించుకోవాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ శివశంకర్ రెడ్డి ఓం ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కొత్తచెరువు మండల పరిధిలోని కొడపగానీ పల్లి గ్రామంలో బ్యాంకు సేవలపై ఆర్బీఐ ఆధ్వర్యంలో కెనరా బ్యాంకు సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యత ప్రాధాన్యత, డిజిటల్ లావాదేవీలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులమని చెప్పి సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారికి అవగాహన కల్పించారు. భీమా పథకాలైన పిఎం జెజెబివై, పిఎస్‌బివై, వైద్య, వ్యవసాయ రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డు, బ్యాంకు లింకేజీ తదితర వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిఎఫ్ఎల్ కౌన్సిలర్ ఓం ప్రసాద్, కొడప గాని పల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఆటల పోటీలు

కొత్తచెరువు : వికలాంగుల కోసం ఏర్పాటు చేసిన ఆటల పోటీలను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో మీనాక్షి, జిల్లా విద్య విభాగపు కోఆర్డినేటర్ ఆనంద్ బాబు తెలిపారు గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శ్రీ సత్యసాయి జిల్లా విభిన్న ప్రతిభావంతుల ఆటల పోటీలను వారు ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోనే 32 మండలాల నుండి ప్రభుత్వ పాఠశాలలో చదివే వికలాంగ విద్యార్థులు 250 మంది హాజరై పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చంద్రమౌళి, పీఈటీలు నాగరాజు, అంజన్న, ఆనంద్ బాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

నల్లచెరువు: మండల పరిధిలోని గొల్లపల్లికి చెందిన నీలకంఠ(40) ప్రమాదవశాత్తు మృతిచెందాడు. విషయాన్ని మండల నాయకుల ద్వారా తెలుసుకున్న వైసిపి సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, గురువారం గ్రామానికి వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి 10వేల రూపాయల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కల్లిపల్లి శ్రీనివాసులు, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

వలసలను నివారించాలి : సిపిఎం

పుట్టపర్తి రూరల్: రైతులకు రైతు కూలీలకు ఉపాధి పనులు విరివిగా కల్పించి వలసలను నివారించాలని సిపిఎం నాయకులు ఈఎస్ వెంకటేష్, బ్యాళ్ల అంజి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం కర్నాటక నాగేపల్లి సమీపంలో గల ఉపాధి కూలీలను రైతులను కలసి మాట్లాడారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి పనులు కల్పించి తమను ఆదుకోకపోతే, తిరిగి వలస బాట పట్టాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోయారు. అనంతరం ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా వర్షాలు సరైన సమయంలో కురవకపోవడంతో ఎంతో మంది రైతులు పంటలు సాగు చేయలేక పోయారన్నారు. దీంతో రైతులకు రైతు కూలీలకు ఉపాధి పనులు లేవని అదేవిధంగా చేతి మగ్గాల వారికి పనులు లేక తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. ఈ తరుణంలో వారు బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాలకు వలస బాట పడుతున్నారని వారిని ఆదుకోవాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే పనులు కల్పించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నాణ్యమైన విద్యనందించాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పాఠశాలలో విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించేలా మరింత కృషి చేయాలని ఎంఇఒ -2. గోపాల్ నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని వంశీకృష్ణ హైస్కూల్‌ను వారు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు రికార్డులను వారు పరిశీలించారు. బస్సుల యొక్క ఫిట్నెస్ సర్టిఫికెట్లను, వాటి కండిషన్లు కూడా వారు పరిశీలించారు. పాఠశాలలోని విద్యార్థుల అడ్మిషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థుల రక్షణకు గ్రిల్స్ ఏర్పాటు చేయాలని, మరింత విద్యను అందించేందుకు క్వాలిఫైడ్ టీచర్స్ కూడా నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యా శాఖకు అందించే అన్ని సంక్షేమ పథకాలను విద్యార్థులకు అందేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ బీరే గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు పోరాటం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందామని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చా రు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాతా గురువారం పట్టణానికి చేరుకుంది. స్థానిక వై జంక్షన్ వద్ద జాతాకు యుటిఎఫ్ జిల్లా, స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద ఎన్.వెంకటే శ్వర్లు మాట్లాడుతూ 'ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం-ప్రభుత్వ పెన్షన్‌ని రక్షించుకుందాం' నినాదంతో ఆంధ్రప్రదేశ్ ఐక్యపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్)ను స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జాతాలు ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత, కర్తవ్యాన్ని ఉపాధ్యా యులు తీసుకోవాలని కోరారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేట్లకు లాభం చేకూర్చే జిపిఎస్ విధానాన్ని బలవంతంగా అమలు చేసే ప్రయత్నం చేస్తుందని, తద్వారా భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఒపిఎస్‌ను తప్ప మరే పెన్షన్ స్కీంను యుటిఎఫ్ అంగీకరించదని, అవసరమైతే ఐక్య ఉద్యమాలకు సిద్ధపడతామన్నారు. అంతకుముందు హిందూపురం సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు జెండాను ఆవిష్కరించి, ప్రచారజాతా ప్రారంభ సూచికగా బెలూన్లు, తారాజువ్వలు, పావురాలను ఎగురవేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, గౌరవాధ్యక్షులు భూతన్న, రాష్ట్ర కార్యదర్శి కొటేశ్వరప్ప, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు నారాయణస్వామి, తాహిర్‌వలి, శివశంకర్, నాయకులు నాగేంద్ర, రమేష్, కృష్ణానాయక్, నరేష్, సోమశేఖర్, నబి, రామకృష్ణనాయక్, ఉపేంద్ర, ఆదిజినేష్, గాయత్రి, లావణ్య, గౌరమ్మ, జావీద్, నరసింహులు, పెద్దిరాజు, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారజాతాలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

నిరాధార ఆరోపణలపై పరువు నష్టం దావా వేస్తాం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఆటో నగర్ అసోసియేషన్‌లో ఏలాంటి అక్రమాలు జరగలేదని, అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం దావా వేస్తున్నామని ఆ అసోసియేషన్ అధ్యక్షులు ఇస్మాయిల్ అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యర్థులు చేసిన ఆరోపణలను ఖండించారు. 2019లో ఆటోనగర్ నూతన కార్యవర్గం ఎంపిక అయిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏలాంటి అక్రమాలు జరగ లేదన్నారు. గతంలో ఉండే కార్యవర్గ సమయంలో చాలా అవకతవకలు జరిగినట్లు ఆరోపించారు. తమ కార్యవర్గం ఏర్పడినప్పటి నుంచి ఆటో నగర్ ను ప్రభుత్వం నుంచి అప్రువల్ చేసుకోవడం జరిగింది. త్వరలో కేటాయించిన స్థలాలను వారికి రిజిస్టర్ చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇది చూసి ఓర్వలేని కొంత మంది ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆరోపణలు చేసిన వారిపై న్యాయ బద్దంగా పరువు నష్టం దావా వేయడంతో పాటు న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షులు వెంకటేష్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందిద్దాం

ప్రజాశక్తి బత్తలపల్లి

సమాజానికి మంచి ఆహారాన్ని అందించాలంటే ప్రకతి వ్యవసాయం ఒక్కటే మార్గమని జిల్లా అగ్రిబోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రైతులకు విత్తనాల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయనతో పాటు ఎస్సీ కార్పోరేషన్ సారయ్య, ఈవో శంకరయ్య, ఏవో ఓబిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, వైస్ ఎంపీపీ సాకే పార్వతి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అండగా నిలుస్తూ వారికి ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తగిన చర్యలు తీసుకుంటున్నారన్నారు. అంతకుముందు మండలంలోని పోట్లమర్రి గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో, వీఎన్ఏ ముత్యాలప్ప, వైసిపి నాయకులు బండి నాగభూషణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-హిందూపురం

పౌష్టిక ఆహారంతో గర్భిణులతో పాటు చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైద్యులు కేశవులు అన్నారు. రూరల్ మండలంలోని పూలకుంట ఐసిడిఎస్ కార్యాలయంలో పోషణ అభియాన్ ఇంటింటి పోషణ సంబరాల కార్యక్రమాన్ని సిడిపిఒ రెడ్డి రమణమ్మ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, సూపర్‌వైజర్లు శాంతమ్మ, జయమ్మ, అనితతో పాటు అంగన్ వాడీ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

వినాయక లడ్డూవేలం

ధర్మవరం టౌన్ : పట్టణ సమీపంలోని పోతులనాగేపల్లి లేఅవుట్ కాలనీలో వినాయక మండపం వద్ద వినాయక లడ్డు వేలం వేశారు. ఓంనాథ్ అనే వ్యక్తి రూ. 10, 116లకు లడ్డును దక్కించుకున్నారు.

వినాయక నిమజ్జనానికి పటిష్ట భద్రత : ఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో 24వ తేది ఆదివారం జరిగే వినాయక నిమజ్జనాకి అవసరమైన అన్ని భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎస్‌పి మాధవ రెడ్డి అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న గణేష్ ఉత్సవ కమిటీలతో పాటు సర్వమత పెద్దలతో గురువారం వన్ టౌన్‌బ స్టేషన్‌లో సర్వమత శాంతి సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఎస్‌పితో పాటు డిఎస్‌పి కంజాక్షన్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, తహశీల్దార్ హసీనా సుల్తాన, ట్రాన్స్ కో డీఈఈ భూపతి, వైస్ చైర్మేన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, మాజీ ఎమ్మేల్యే అబ్దుల్ ఘనీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉత్సవ కమిటీ నిర్వహకులు, ముస్లీం మత పెద్దలు, ముత్వల్లీలు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా ఎస్‌పి మాట్లాడుతు వినాయక విగ్రహ ఊరేగింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

ఆలయ నిర్మాణ కమిటీ ఏర్పాటు

తనకల్లు : మండల కేంద్రంలో రజక సంఘం నాయకుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన గంగమ్మ ఆలయ నిర్మాణ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డి. గంగాధర్, గౌరవాధ్యక్షులుగా డి. అంజన్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఈ. నారాయణ, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులుగా ఈ. హరినాథ్, శ్రీరాములు, పి.మల్లికార్జున, కోశాధికారిగా ఆంజనేయులు, కమిటీ సభ్యులుగా వై.అనిల్, వెంకటప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

పాంచజన్య పాఠశాలలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది ఆరోగ్యంపై పాఠశాల యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య సేవలను అందించడం అభినందనీయమని ప్రముఖ ఫిజిషియన్, కార్డియాలజిస్ట్ డాక్టర్ జక్కా నరేంద్ర అన్నారు. పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్స్ హై స్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలోకార్డియాలజిస్ట్ డాక్టర్ జక్కా నరేంద్ర, జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్ డాక్టర్ నందిత తదితరులు ఉపాధ్యాయులకు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాల తరపున అందరికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతు పాఠశాలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందితో పాటు అనారోగ్య సమస్యలను ఎదుర్కోంటున్న కొంతమంది విద్యార్థులకు, బస్సు డ్రైవర్లు, క్లీనర్లు అందరి శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణ ఉద్దేశంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమం ప్రతి సంవత్సరం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నంద కుమార్, హెచ్ఎం గాయిత్రి, ఎఒ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

రొద్దం : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి పెనుకొండ వై జంక్షన్‌లో చోటు చేసుకొంది. మండల పరిధిలోని గోనిమేకలపల్లి గ్రామానికి చెందిన కురుబ సన్నాయప్ప తన కూతురిని పెనుకొండ మండలంలోని మొటివారిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశాడు. వినాయక చవితి పండుగ సందర్భంగా మొటివారిపల్లి వెళ్లి తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై అల్లుడుతో కలిసి గొర్రెను తీసుకుని బయల్దేరారు. మార్గమధ్యలో పెనుకొండ వై జంక్షన్‌లో వెనుక వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు హుటాహుటిన పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నిందితురాలికి ఐదేళ్లు జైలు

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి గ్రామానికి చెందిన ప్రమీలమ్మకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ గురువారం అనంతపురం నాల్గవ ఎడిజె కోర్టు జడ్జి శోభారాణి తీర్పు ఇచ్చారు. కేసు పూర్వాపరాలు.. ప్రమీలమ్మ భర్త శంకర ఇదే గ్రామానికి చెందిన చాకలి ప్రసాద్ అక్కతో వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నాడు. ఈ విషయంలో ప్రమీలమ్మ ప్రసాద్‌ను తరచూ వేధిస్తూ ఉండేది. దీంతో మనస్తాపం చెందిన ప్రసాద్ జీవితంపై విరక్తి చెంది 2016 నవంబర్‌లో ఆత్మహత్యకు పాల్పడగా అప్పట్లో గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. తదుపరి ఈ కేసుపై విచారణ నిమిత్తం ప్రస్తుత గోరంట్ల పట్టణ సిఐ సుబ్బరాయుడు దర్యాప్తు పూర్తి చేసి నిందితురాలిని కోర్టులో హాజరుపరచగా ప్రమీలమ్మకు జడ్జి శిక్షను ఖరారు చేసినట్లు సిఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ముదిగుబ్బ : మండలంలోని రెండు జీమానుల సమీపాన ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. మండలకేంద్రానికి చెందిన అంజి అనే వ్యక్తితో పాటు అతని మామ శ్రీరాములు పొద్దుటూరు నుంచి స్వగ్రామానికి వస్తుండగా రెండు జీమానుల వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అంజి అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీరాములుకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని బత్తలపల్లి ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మరో ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తనకల్లు : మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కదిరికి చెందిన పాజిల్ వ్యక్తికి గాయాలు అయ్యాయి. తన ఐచర్ వాహనాన్ని రోడ్డు ప్రక్కన నిలబెట్టి రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఫాజిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని కాలు విరిగింది. స్థానికులు 108 ద్వారా క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థి మృతి

బత్తలపల్లి : పదవ తరగతి సప్లమెంటరీ ఫలితాలలో ఫెయిల్ అయ్యాయన్న మనస్థాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న విద్యార్థిని గురువారం మృతి చెందినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు. మండలంలోని డి. చెర్లోపల్లి గ్రామానికి చెందిన బెస్త సురా వెంకటరమణ కుమార్తె సుదా స్రవంతి(16) ఇటీవల పదవ తరగతి సప్లమెంటరీ ఫలితాల్లో ఫెయిల్ అయింది. దీంతో మనస్థాపంతో ఈ నెల 12వ తేదీన ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు మృతురాలి బంధువులు తెలిపారు. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్.. రూ.2 లక్షల ఆస్తి నష్టం

ఓబులదేవరచెరువు : మండలంలోని మామిడికుంట్లపల్లిలో బుధవారం అర్ధరాత్రి ఎద్దుల. శంకర్ రెడ్డి చెందిన గృహంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఈ ప్రమదంలో రూ. 2లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. శంకర్ రెడ్డి కుటుంబ సభ్యులందరూ కొత్త గృహంలో నిద్రిస్తుండగా పాత గృహంలో కుమారుడు భాను ప్రకాష్ రెడ్డి చెందిన కంప్యూటర్, ల్యాప్‌టాప్, ప్రింటర్లు ఇతర విలువైన వస్తువులు ఉంచారు. ఆ ఇంటిలో బుధవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. గమనించిన చుట్టుపక్కల వారు శివారెడ్డికి సమాచారమందించారు. అప్పటికే ఇంటిలోని వస్తువులన్ని కాలిపోయాయని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరాడు.

హత్య కేసులో నిందితులు అరెస్టు

ముదిగుబ్బ : దొరిగల్లు క్వార్టర్స్ లో వినాయక వేడుకల్లో ఇరువర్గాల ఘర్షణలో జరిగిన హత్యకేసుకు సంబందించి 9 మంది నిందితులను అరెస్టు చేసినట్లు సిఐ యతీంద్ర తెలిపారు, వీరిలో ఇద్దరు మైనర్లను బాల నేరస్తుల విభాగానికి ఏడుగురు రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. మిగిలిన వారిని అరెస్టు చేయాల్సుందన్నారు.

టిడిపి బూత్ కన్వీనర్ గుండెపోటుతో మృతి

తలుపుల: మండల కేంద్రంలోని ఎగువపేటలోని టిడిపి బూత్ కన్వీనర్ చిన్నకొట్ల మహేశ్వర (45) గుండెపోటుతో గురువారం మృతిచెందాడు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా కదిరిలో కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రీలే నిరాహార దీక్షకు వెళ్లిన ఆయన శిబిరంలో పాల్గొన్నాడు. ఆసమయంలో గుండెపోటుకు గురయ్యారు. దీంతో అక్కడున్న వారు మహేశ్వరను ఆసుపత్రికి తరలించారు. అయితే మహేశ్వర అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య తో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

బంధువుల చెంతకు వృద్ధురాలు

హిందూపురం : మతిస్థిమితం లేకుండా పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ఉన్న వృద్ధురాలిని రైల్వే పోలీసులు గురువారం ఆమె బంధువులకు అప్పగించారు. గత సోమవారం వివేక్ ఎక్స్‌ప్రెస్ రైలులో వెళుతున్న మతి స్థిమితం లేని వృద్ధ మహిళ హిందూపురానికి వచ్చింది. దీంతో బంధువులు ఆమెను వెతుకుతు హిందూపురానికి వచ్చి ఆమె ఫోటో ఇచ్చి వారి వివరాలను ఇచ్చి వెళ్లారు. దీంతో గురువారం బుకింగ్ వద్ద ఆ వృద్ధ మహిళను గమనించిన పలువురు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మేళాపురంలో ఉన్నా వృద్ధ మహిళ బంధువులను పిలిపించి వారికి అప్పగించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కదిరి టౌన్ : వినాయక నిమజ్జనం సందర్భంగా కదిరిలో విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం ఉన్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కాలేజీ సర్కిల్ నుంచి హిందూపురం రహదారి గట్లు , ముత్యాల చెరువు వరకు, మారుతి నగర్,జొన్న స్ట్రీట్, నల్లగుట్ట, ఎంజీ రోడ్ , పూలబజార్, తేరు బజార్, టెంపుల్ వీధి, మగ్గాల క్వాటర్స్‌లో విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఇందుకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

మిథున్ రెడ్డిని కలిసిన 'బత్తల'

కదిరి టౌన్ : వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరి ప్రసాద్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బత్తల వెంకట రమణ ఎంపీ మిథున్ రెడ్డిని ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. కదిరి నియోజకవర్గంలోని పరిస్థితులు పార్టీ కార్యక్రమాలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించినట్లు వారు చెప్పారు.

పొలంబడి

ముదిగుబ్బ : మండలంలోని సానేవారి పల్లి క్లస్టర్ పరిధిలో పొలం బడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. డిఆర్‌సి ఎడిఎ సనావుల్లా, ఎడిఎ(ఆర్) సత్యనారాయణ, ఎడి ఎపిపి విద్యావతి, ఎఒ లక్ష్మీనరసింహులు ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పొలంబడి ఫ్లాట్ లలో అమర్చిన లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాలు,సాగుచేసిన కంచెపంట, ఎరపంటలను, వేరుశనగ పంటను పరిశీలించారు. అనంతరం పొలంబడి రైతులకు పొలంబడి బ్యాగు కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ షరీఫ్, వ్యవసాయ శాఖ సిబ్బంది, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వితీయ వార్షికోత్సవ సభ

ముదిగుబ్బ : మండలంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఫెడ్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వితీయ వార్షికోత్సవ సమావేశం బుధశారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ సత్యనారాయణ, డి అర్ సి ఎడిఎలు సనావుల్లా, విద్యా వతి, మండల వ్యవసాయ అధికారులు కె. లక్ష్మినరసింహులు, అలీ, రైతులు పాల్గొన్నారు.

వైసిపికి రోజులు దగ్గర పడ్డాయి : టిడిపి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వైసిపికి రోజులు దగ్గరపడ్డాయని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విమర్శించారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పుట్టపర్తి తెలుగుదేశం కార్యాలయంలో నిర్వహించిన రిలే దీక్షలు గురువారానికి తొమ్మిదవ రోజుకు చేరుకున్నాయి. నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీలు రిలే నిరాహార దీక్షకు పెద్ద సంఖ్యలో నాయకులుహాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో అన్ని పార్టీల నాయకులు చంద్రబాబు నాయుడు తప్పు చేయలేదని చెబుతుంటే జగన్ మాత్రం తన వికృత చేష్టలు వీడలేదన్నారు. పుట్టపర్తి నియోజకవర్గ పరిశీలకులు బచ్చాల పుల్లయ్య మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. కక్ష సాధింపు ధోరణలతో టిడిపి నాయకులను జైలులో ఉంచి ఎన్నికలకు వెళ్లాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల కన్వీనర్లు రామాంజనేయులు, విజయ్ కుమార్, సామకోటి ఆదినారాయణ, శ్రీరామి రెడ్డి, శ్రీరామ నాయక్, అంబులెన్స్ రమేష్, మనోహర్, బొమ్మయ్య, పుల్లప్ప,మహమ్మద్ రఫీ, బుక్కపట్నం కొత్తచెరువు పుట్టపర్తి, నల్లమాడ, ఒడిసి మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం :చంద్రబాబు అరెస్టు తరువాత వైసిపి నాయకుల వెన్నులో వణుకు మొదలైందని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా రామగిరి మండలం పేరూరులో రాప్తాడు నియోజకవర్గ తెలుగు మహిళల ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మాజీ మంత్రి పరిటాల సునీత ఈ దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం మహిళలతో కలిసి పేరూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. సీఎం జగన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబును అనవసరంగా అరెస్టు చేయించామన్న భయం వైసిపి నాయకుల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా వేలాది మందికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడమే చంద్రబాబు చేసిన నేరమా అంటూ పరిటాల సునీత ప్రశ్నించారు. సీఐడీ అధికారులు వాస్తవాలు పట్టించుకోకుండా సీఎం జగన్ రెడ్డి చెప్పినట్టుగా కేసులు పెడుతున్నారన్నారు. అసెంబ్లీలో నందమూరి బాలకృష్ణ పై అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యల మీద తీవ్రంగా స్పందించారు. అంబటి రాంబాబు తన శాఖ గురించి తప్ప ప్రతిపక్షాలను తిట్టడానికి పరిమితమయ్యారని విమర్శించారు. రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి పేరూరు జలాశయానికి నీరు ఇస్తానని ప్రగల్భాలు పలికారని.. కానీ ఆయన చేసింది ఏమి లేదని సునీత అన్నారు. తాము గతంలో తీసుకొచ్చిన ప్రాజెక్టులను రద్దు చేసి ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఎమ్మెల్యే సోదరులు చేసిన అక్రమాలపై ఖచ్చితంగా విచారణ జరుగుతుందన్నారు. చంద్రబాబు అరెస్టు తర్వాత ఎవరు భయపడాల్సిన అవసరం లేదని ఆయన కచ్చితంగా బయటకు వస్తారని అప్పటివరకు పోరాటం ఆప కూడదని పరిటాల సునీత సూచించారు.

ధర్మవరం టౌన్ :ఓటమి భయంతోనే సీఎం జగన్ టీడీపీ అధినేత చం ద్రబాబునాయుడుపై తప్పుడు కేసులు బనాయించారని టీడీపీ ఎస్సీసెల్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలేనిరాహారదీక్షలో టీడీపీ ఎస్సీసెల్ నాయకులు పాల్గొన్నారు. ఈ దీక్షల్లో రామగిరి ఎస్సీసెల్ నాయకులు ముత్యాలు, ధర్మవరం ఎస్సీసెల్ నాయకులు కేశగాళ్ల శ్రీనివాసులు, గుజ్జల రామాంజినేయులు, కేశగాళ్ల వెంకటేశ్, సుబ్బరాయుడు, వెంకటరాముడు, పోతన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



పేరూరులో నిరసన ర్యాలీలో పరిటాల సునీత, తదితరులు

పుట్టపర్తి క్రైమ్ : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ చేపట్టిన నిరాహార దీక్షలు గురువారానికి 9 వ రోజుకు చేరుకున్నాయి. గురువారం పుట్టపర్తి పట్టణంలోని టిడిపి కార్యాలయం ముందు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు నిరసన దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మైనార్టీ నాయకుడు మహమ్మద్ రఫీ, నాయకులు శ్రీరామ్ రెడ్డి, బివి ప్రసాద్, అంబులెన్స్ రమేష్, మాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



కదిరిలో నిరసన దీక్షలో కందికుంట, తదితరులు

కదిరి టౌన్ : చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టి లబ్ధిపొందాలనుకోవడం వైసిపి మూర్ఖత్వమని నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. చంద్రబాబు అరెస్టును వ్యతిరేకిస్తూ కందికుంట అధ్వర్యంలో గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కక్ష గట్టి చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజలు తప్పక బుద్ధి చెబుతారన్నారు. అనంతరం అరెస్ట్ ను వ్యతిరేకిస్తూ పోస్ట్ కార్డు పై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోపురి శెట్టి చంద్రశేఖర్, రాజశేఖర్ బాబు, బంగారు కృష్ణమూర్తి, డైమండ్ ఇర్ఫాన్, రమణ, గంగయ్య నాయుడు, బండారు మనోహర్ నాయుడు, మహిళా నాయకురాలు పర్వీన్ భాను, పీటల రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం చేరుకున్న వందేభారత్ రైలు



ధర్మవరం స్టేషన్‌లో ఆగిన వందేభారత్ రైలు

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణానికి వందే భారత్ రైలు గురువారం ఉదయం 11-15 గంటలకు చేరుకొంది. ఈ సందర్భంగా రైల్వే అధికారులు, ప్రయాణికులు రైలుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్టేషన్ మాస్టర్ నరసింహానాయుడు మాట్లాడుతూ వందేభారత్ రైలు ప్రస్తుతం ట్రైలర్‌గా నడుస్తోందన్నారు. రైలులో ఐపిఎఫ్ కుమార్, అసిస్టెంట్ ఆపరేషన్ మేనేజర్ గుంతకల్- పూర్ణచంద్రరావు వచ్చారన్నారు. ధర్మవరం స్టేషన్ నుంచి 11-20 గంటలకు బెంగళూరుకు బయలుదేరి వెళ్లింది. వందేభారత్ రైలును చూడటానికి అధిక సంఖ్యలో ప్రజలు స్టేషన్‌కు వచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఆర్‌పిఎఫ్, జీఆర్పీ రైల్వే పోలీసులు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కదిరి అర్బన్ : అంగన్వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి నోటిఫి కేషన్ జారీ చేసినట్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. ఖాళీగా ఉన్న 7 అంగన్వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. కదిరి మున్సిపాలిటీ లో ఓసి గంగిరెడ్డిపల్లి 1, తలుపుల మండలం కొవ్వూరు వాండ్లపల్లి బీసీ, బి 1, కదిరి రూరల్ మొటికపల్లి ఓసీ 1, కదిరి రూరల్ బాలప్పగా పల్లి ఓసీ 1, నంబుల పూలుకుంట మండలం ఎన్ రెడ్డివారి పల్లి బీసీఏ 1, నంబుల పూలుకుంట మండలం జోకల ఓసీ1, తలుపుల మండలం వేపలపల్లి తండా దివ్యాంగులకు కేటాయించినట్లు వారు తెలిపారు.

మడకశిర : గుడిబండ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ పద్మావతి తెలిపారు. ఖాళీగా ఉన్న అమరాపురం పేలుబండలో ఆయా పోస్టు (ఓసి), అమరాపురం -4లో ఆయా పోస్టు (ఎస్సీ), బల్లేకట్ట మినీ కార్యకర్త పోస్టు (ఓసి)కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ఈ నెల 21 వ తేదీ నుండి 29 వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చిలమత్తూరు : మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ రెడ్డిరమణమ్మ, సూపర్‌వైజర్ లలితమ్మ తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 29లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దేమకేతేపల్లి-1 (బీసీ-డి), చేనేపల్లి (బిసీ-ఏ),హుస్సేన్‌పురం (పీహెచ్) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

హిందూపురం : హిందూపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్నా అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ రెడ్డి రమణమ్మ తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 29వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఐసిడిఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

'కందికుంట'ను కలిసిన యువకులు

ప్రజాశక్తి-తనకల్లు

మండలంలోని టిడిపికి చెందిన యువకులు గురువారం మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్‌ను శుక్రవారం కలిశారు. కందికుంట స్వగృహం లో ఆయను కలిసి మాట్లాడారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మండల పరిధిలోని యువకులకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని చెప్పారు. వారికోసం తాను ఎటువంటి సేవలు అందించడానికైనా సిద్ధంగా ఉంటానని, ప్రస్తుత జగన్మోహన్ రెడ్డి, ప్రభుత్వం యువకులను నిర్వీర్యం చేస్తుందని వారికి ఉద్యోగ, ఉపాధి, అవకాశాలు కల్పించకుండా వారిని మత్తు పదార్థాలకు అలవాటు పడే విధంగా చేస్తోందని, యువత నిర్వీర్యమవుతోం దని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి వారిని ఉన్నత పోరులుగా మారుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు తోట కిషోర్, నాగార్జున క్రాంతి, సాయి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



కదిరిలో కందికుంట వెంకటప్రసాద్‌ను కలిసిన టిడిపి యువకులు

అభ్యుదయ కవి గురజాడ



మాట్లాడుతున్న జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

గురజాడ అప్పారావు గొప్ప అభ్యుదయ కవి అని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు అన్నారు. గురజాడ జయంతి సందర్భంగా గురువారం స్థానిక సూర్య స్కూల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర బాబు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో డాక్టర్ ఆదిశేషు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక కవుల నుండి ఏమి కోరుకుంటుందో దాన్ని ఆచరించి చూపిన గొప్ప అభ్యుదయ కవి గురజాడ అన్నారు. దేశమంటే మట్టి కాదు దేశమంటే మనుషులనే అని నూతన ఒరవడిని సృష్టించిన గురజాడ దేశమంటే భౌగోళిక సరిహద్దులు అనే నానుడిని చెరిపేశాడన్నారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఆయన లేవనెత్తిన అంశాలను, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఆనాడు ఆయన చేసిన సంఘసంస్కరణ ఉద్యమాన్ని విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జయంతి సభలో వక్తలు

గొప్ప సంఘ సంస్కర్త.. లౌకిక వాది

కదిరి టౌన్ : మహాకవి గురజాడ వెంకట అప్పారావు గొప్ప సంఘ సంస్కర్త, హేతువాది, స్త్రీ జనోద్ధారకుడు అని జనవిజ్ఞానవేదిక జిల్లా ఉపాధ్యక్షులు బి. నరసారెడ్డి అన్నారు. గురువారం పట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞానవేదిక కదిరి శాఖ ఆధ్వర్యంలో మహాకవి గురజాడ వెంకట అప్పారావు జయంతిని నిర్వహించారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. లక్ష్మీదేవి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు దేశభక్తి గేయాలాపన పోటీలు నిర్వహించి ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు అందజేశారు.ఆధునిక మహిళ చరిత్రను తిరగ రాస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం ప్రిన్సిపల్ రవికుమార్ మాట్లాడుతూ. గురజాడ అప్పారావు చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో. కళాశాల సిబ్బంది. వెంకటేశ్వర ప్రసాద్, వెంకటకృష్ణయ్య, గంగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి

సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-హిందూపురం

ట్రక్ ఓనర్లతో పాటు కార్మికుల సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని వైసిపి నాయకులు గుడ్డం పల్లి వేణు రెడ్డి అన్నారు. రూరల్ మండలం గోళాపురం పంచాయతీ పరిధిలో గురువారం ఏర్పాటు చేసిన గోళాపురం ట్రక్ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని వైసిపి నాయకులు గుడ్డం పల్లి వేణు రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా లారీ ఓనర్లు, డ్రైవర్లు వారు ఎదుర్కొంటున్న సమస్యలను వేణు దృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం వేణు రెడ్డి మాట్లాడుతు ట్రక్ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దేవరాజు, నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, తిప్పేరుద్రయ్య, రవీంద్రారెడ్డి, మార్కెట్ చాంద్, హిందూపూర్ లారీ అసోసియేషన్ ప్రెసిడెంట్ హుమాయున్, తూముకుంట దేవరాజు, గొల్లపురం వైస్ సర్పంచి సనావుల్లా, రంగనాథ్, మాజీ సర్పంచి మూర్తి, చంద్రశేఖరరెడ్డి, మాజీ సర్పంచ్ నాగార్జున, శివ, లారీ ఓనర్స్, లారీ డ్రైవర్స్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వినాయక లడ్డూ వేలం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ప్రియాంక నగర్‌లో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా గత మూడు రోజులుగా జరుగుతున్నాయి. గురువారం నాడు వినాయకుని లడ్డును వేలంపాటను నిర్వహించారు. వేలంపాటలో 27వ వార్డు కౌన్సిలర్ డోలా ఓబులమ్మ భర్త, ఆర్టీసీ డివిజన్ గౌరవ అధ్యక్షులు డోలా రాజారెడ్డి రూ.13,200కు లడ్డును కైవసం చేసుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎన్నికల హామీలు అమలు చేయండి

రాష్ట్ర ఫీల్డ్ అసోసియేషన్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నరసింహులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఉపాధి హామీ పథకంలో గత 17 సంవత్సరాల నుంచి విధులు నిర్వర్తిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం 20వేల రూపాయలు ఇవ్వాలని రాష్ట్ర ఫీల్డ్ అసోసియేషన్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నరసింహులు కోరారు. ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గురువారం స్థానిక ఎంపిడీఓ సౌజన్యకుమారికి అందజేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు పెంచలేదన్నారు. వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నసమయంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనం పెంచుతానని, ఉద్యోగ భద్రత కల్పిస్తానని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా ఈ హామీలు నెరవేరలేదన్నారు. కనీస వేతనం రూ.20వేలు ఇవ్వాలన్నారు. ఎఫ్‌టిఈ వర్తింపజేయాలన్నారు. అర్హత, అనుభవం కలిగిన వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. ప్రమాదవశాత్తు ఫీల్డ్ అసిస్టెంట్లు చనిపోతే వారి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు నరసింహులు, రమేష్, అశోక్, పోతులయ్య, శివ, రామచంద్ర, యుగంధర్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్



దీక్షల్లో పాల్గొన్న టిడిపి నాయకులు

చంద్రబాబు అక్రమ అరెస్టు నిరసనగా పుట్టపర్తి పట్టణంలోని టిడిపి పార్టీ కార్యాలయంలో 9వ రోజు రిలే నిరాహార దీక్షలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సారథ్యంలో ఈ దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చేయని నేరానికి చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారన్నారు. కడిగిన ముత్యంలా ఆయన బయటకు వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బచ్చల పుల్లయ్య, రామాంజనేయులు, మైనార్టీ నాయకుడు మహమ్మద్ రఫీ, బొమ్మయ్య, ఎస్‌టి సెల్ కాలే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గణనాథుల నిమజ్జనం



పుట్టపర్తిలో వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పుట్టపర్తిరూరల్

పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో వినాయక చవితిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాల నిమజ్జనం గురువారం ఘనంగా జరిగింది. గురువారం ఉదయం నుంచి సత్యసాయి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు తమ పాఠశాలలో, కళాశాలలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అదే విధంగా సత్యసాయి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు వినాయక నిమజ్జనాలను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలు, తోరణాలతో రథాలను ముస్తాబు చేసి పట్టణంలో ఊరేగించగా వాటిని తిలకించడానికి పట్టణవాసులు ఆసక్తి చూపారు. వినాయక నిమజ్జనం సందర్భంగా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి పట్టణంలో సత్యసాయి విద్యాసంస్థలలో ఏర్పాటుచేసిన వినాయకులను నిమజ్జనానికి తరలించారు. గురువారం పట్టణంలో పండగ వాతావరణం నెలకొంది. సత్యసాయి విద్యాసంస్థలైన కాలేజీలు, హైయ్యర్ సెకండరీ స్కూల్, ప్రైమరీ స్కూల్, ఈశ్వరమ్మ హై స్కూల్, అలాగే యూనివర్సిటీ, జనరల్ హాస్పిటల్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఎయిర్‌పోర్ట్ తదితర సత్యసాయి సంస్థలలో నెలకొల్పిన గణనాథులను ముందుగా మందిరంలోని కుల్వంత్ హాల్ దగ్గరకు తీసుకెళ్లి సత్యసాయి సమాధి దర్శనం అనంతరం నిమజ్జనానికి తరలించారు. ఈ నిమజ్జనానికి విద్యార్థులు రకరకాల వేషధారణలో కనువిందు చేశారు. పట్టణంలో భజనలతో సత్యసాయి కీర్తనలతో పుట్టపర్తి పురవీధులు మారుమోగి పోయాయి. వినాయకులను తరలిస్తున్న సందర్భంగా సుమారు గంటపాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో సత్యసాయి విద్యార్థులు, ఉపాధ్యాయులు, దేశ విదేశీ భక్తులు, పట్టణ వాసులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

కొత్తచెరువు : వినాయక పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను గురువారం నిమజ్జనం చేశారు. బుక్కపట్నం చెరువులో ఈ నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వాణి శ్రీనివాసులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.